సాక్షి
అనంతపురం

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025

నేడు పాపిరెడ్డిపల్లికి వైఎస్ జగన్

- హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబానికి పరామర్శ
- ఏర్పాట్లు చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: టీడీపీ గూండాల చేతిలో ఇటీవల దారుణ హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లాకు రానున్నారు. రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఈ ఏడాది మార్చి 30న కొందరు టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న కురుబ లింగమయ్య కుటుంబంపై దాడికి దిగారు. దాడిలో లింగమయ్య తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలాడు. నిందితులు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత దగ్గరి బంధువులు. అయితే మరుసటి రోజు లింగమయ్య అంత్యక్రియలకు ఎవరినీ అనుమతించకుండా పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. ఈ క్రమంలోనే బాధిత కుటుంబ సభ్యులతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ నెల 8వ తేదీన పాపిరెడ్డిపల్లికి వస్తానని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగా మంగళవారం బెంగళూరు నుంచి పాపిరెడ్డిపల్లికి వస్తున్నారు. లింగమయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పనున్నారు. ఆ కుటుంబానికి భరోసా కల్పించనున్నారు. ఈ క్రమంలో వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్లను ఆయన కార్యక్రమాల కోఆర్డినేటర్ తలశిల రఘురామ్ సోమవారం పరిశీలించారు.

విజయవంతం చేద్దాం

అనంతపురం కార్పొరేషన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లి పర్యటనను విజయవంతం చేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ గూండాల దాడిలో ఇటీవల హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు మంగళవారం వైఎస్ జగన్ ఉమ్మడి జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరు కావాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటులేకుండా, ప్రతి కార్యకర్త సంయమనంతో వ్యవహరించి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలన్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు

- మంత్రి పయ్యావుల కేశవ్



ఉరవకొండ వద్ద హంద్రీ–నీవా కాలువ వెడల్పు పనులను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని, అప్పులు చేస్తే తప్ప ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సోమవారం ఆయన ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీ–నీవా కాలువ విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కేశవ్ మాట్లాడుతూ రాష్ట్రానికి వచ్చే ఆదాయం మొత్తం ఉద్యోగుల జీతాలకే సరిపోతోందని, శుక్రవారం వస్తే ఏ బ్యాంకు నుంచి ఏ ఫోన్ వస్తోందోనన్న భయం వేస్తోందని అన్నారు. బ్యాంకు వాళ్లు ఫోన్ చేసి మీ డ్యూ డేట్ వచ్చింది.. సోమవారంలోగా వడ్డీ కట్టాలని ఎక్కడ అడుగుతారోనన్న భయం వెంటాడుతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో అతి ముఖ్యమైన కార్యక్రమాలు పూర్తి చేయడానికి నిధులు వెచ్చిస్తున్నామన్నారు. జిల్లాకు ముఖ్యమైన హంద్రీ–నీవా కాలువను ఈ ఏడాది జూన్ 10 నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. హంద్రీ–నీవా కాలువ సామర్థ్యం పెంచాలని 2014–19 మధ్యకాలంలో 40 శాతం పనులు పూర్తి చేశామన్నారు. హంద్రీ–నీవా విస్తరణకు రూ.3,800 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు.

నూతన జిల్లా జడ్జిగా భీమా రావు

- నెల్లూరుకు శ్రీనివాస్ బదిలీ



అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఈ. భీమా రావు నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న ఆయనను జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ ఉన్న జి. శ్రీనివాస్ నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. అలాగే, అనంతపురం నాలుగో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (గుత్తి)గా విధులు నిర్వహిస్తున్న శ్రీహరిని పిఠాపురం అదనపు జిల్లా, సెషన్స్ జడ్జిగా, అదనపు జిల్లా జడ్జి ఎం. శోభారాణిని సీబీఐ స్పెషల్ జడ్జి (కర్నూలు)గా బదిలీ చేశారు.

- ఈ.భీమారావు 1972లో పిఠాపురంలో జన్మించారు.బీఎస్సీ, ఎల్ఎల్‌బీ కాకినాడలో పూర్తి చేశారు. పిఠాపురంలో న్యాయవాద వృత్తిని చేపట్టారు. 2013లో అదనపు జిల్లా జడ్జిగా విజయవాడలో బాధ్యతలు చేపట్టారు. 2017లో ఫ్యామిలీ కోర్టుకు బదిలీ అయ్యారు. అదే సంవత్సరంలోనే విజయనగరం ఫ్యామిలీ కోర్టు కమ్–నాలుగో అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. మొదటిసారి 2020లో పదోన్నతిపై పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.
- నెల్లూరుకు బదిలీపై వెళ్తున్న జడ్జి జి. శ్రీనివాస్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సంచలన తీర్పులు వెలువరించారు. కందుకూరు శివారెడ్డి హత్య కేసులో నిందితులకు రెండు జీవిత కాలాల కఠిన కారాగార శిక్ష విధించారు. జిల్లా కోర్టు చరిత్రలోనే మొత్తం 12 కేసుల్లో ముద్దాయిలకు జీవిత ఖైదు విధించిన తొలి ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ కావడం గమనార్హం.

అధికార హత్యాకాండ



- 2014–19 మధ్య టీడీపీ హయాంలో రాప్తాడులో రెండు హత్యలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్య దారుణ హత్య
- పచ్చని పల్లెల్లో చిచ్చు రేపుతున్నారని ప్రజల ఆవేదన
- హత్యా రాజకీయాలను ప్రశ్నించేందుకు నేడు వైఎస్ జగన్ రాక
- అడ్డుకునేందుకు ఎక్కడికక్కడ పోలీసులతో సర్కారు కుట్రలు



టీడీపీ గూండాల దాడిలో మృతి చెందిన కురుబ లింగమయ్య (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అధికారంలోకి వచ్చేందుకు అలవిగాని హామీలిచ్చారు. వచ్చాక వాటిని గాలికొదిలి హత్యా రాజకీయాలు చేస్తున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో పల్లె ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరుగుతున్న హత్యా రాజకీయాలు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. నేతల అక్రమాలను, అరాచకాలను ప్రశ్నిస్తే చాలు పోలీసులను అడ్డు పెట్టుకుని అక్రమ కేసులు బనాయించడం, లేదంటే దాడులు చేయడం పరిపాటిగా మారింది. ఇంతగా దారుణాలు జరుగుతున్నా పోలీసులు నిశ్చేష్టులై చూస్తుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. బాధితుల తరఫున చర్యలు తీసు కుంటే ఎక్కడ బదిలీ అవుతామోనన్న భయం ఖాకీలను వెంటాడుతోంది.

అప్పుడూ అంతే..

టీడీపీ అధికారంలోకి వస్తే హత్యలు కొత్త కాదని తేలిపోయింది.అందులోనూ రాప్తాడు నియోజకవర్గంలో హత్యాకాండ యథేచ్ఛగా సాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2014–19 మధ్య కాలంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాప్తాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ ఎంపీపీ భూమిరెడ్డి ప్రసాదరెడ్డిని, కందుకూరు శివారెడ్డిని దారుణంగా నరికి చంపారు. పరిటాల రవితోనే హత్యా రాజకీయాలు పోయాయనుకుంటే భార్య, కొడుకులతో మళ్లీ మొదలయ్యాయని ప్రజలు అంటున్నారు. 2019–24 మధ్య వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాలో ఎక్కడా చిన్నపాటి గొడవలు కూడా లేవు. పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయి. కానీ 2024లో కూటమి సర్కారు రాగానే.. ఒక్కసారిగా అలజడి చెలరేగింది. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యను దారుణంగా కొట్టి చంపారు. పరిటాల కుటుంబం కనుసన్నల్లోనే ఫ్యాక్షన్ అగ్గి మళ్లీ రాజుకుందని రాష్ట్రవ్యాప్తంగా తెలిసిపోయింది. భూకబ్జాలు, అక్రమణలు, అడ్డొస్తే అంతుచూడ్డాలు ఇవన్నీ ఈ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్యగా ఉమ్మడి జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

పోలీసుల దాష్టీకం

ఓవైపు రాజకీయ నేతల హత్యా రాజకీయాలు.. మరోవైపు పోలీసుల దాష్టీకం వెరసి ఉమ్మడి జిల్లాలో శాంతి భద్రతలు మృగ్యమయ్యాయి. తాజాగా కళ్యాణదుర్గం మండలం శీబావికి చెందిన రామాంజనేయులు పోలీసుల అక్రమ కేసు కారణంగా తీవ్ర ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందారు. తాడిపత్రి నియోజకవర్గంలో అయితే పోలీసుల ఆగడాలకు అడ్డూ అదుపు లేదు. బాధితులపైనే రివర్స్ కేసులు పెట్టి వేధిస్తున్నారు. దీంతో చాలా చోట్ల బాధితులు కేసులు పెట్టడానికి కూడా ముందుకు రాలేని పరిస్థితి.

మారణహోమాన్ని ఆపేందుకే జగనన్న రాక

- చీమకు కూడా హాని తలపెట్టని కురుబ లింగమయ్యను హత్య చేశారు
- శాంతిస్థాపనకు జగనన్నతో కలిసి కవాతు చేద్దాం
- ప్రజలకు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపు



రాప్తాడురూరల్: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ సభలో పాల్గొనేందుకు రావడం లేదు. చీమకు కూడా హాని తలపెట్టని పేద రైతు కురుబ లింగమయ్యను హత్య చేస్తే ఆ కుటుంబానికి అండగా నిలవడానికి, మారణ హోమాన్ని ఆపేందుకు, జిల్లాలో మరో రాజకీయ హత్య జరగకూడదనే సందేశం ఇవ్వడానికి వస్తున్నారు' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాపిరెడ్డిపల్లికి వస్తున్న నేపథ్యంలో సోమవారం తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఓ వీడియో విడుదల చేశారు. వైఎస్ జగన్ మంగళవారం ఉదయం బెంగళూరు నుంచి కుంటిమద్ది మీదుగా పాపిరెడ్డిపల్లి చేరుకుంటారన్నారు. ఇటీవల హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం మీడియాతో మాట్లాడతారని తెలిపారు. తిరిగి అక్కడి నుంచి బెంగళూరు బయలుదేరి వెళతారని వెల్లడించారు.

ఫ్యాక్షన్ భూతాన్ని తరిమికొడదాం

జిల్లాలో ఫ్యాక్షన్ భూతాన్ని తరిమికొట్టాలనుకునే విజ్ఞులు, భవిష్యత్తు బాగుండాలని కోరుకునే యువత, రాప్తాడు నియోజకవర్గ ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు మేల్కోవాలని ప్రకాష్ రెడ్డి కోరారు. కుట్ర, హత్యా రాజకీయాలు కలగలిసి ప్రభుత్వ మద్దతుతో ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 'నడుచుకుంటూ వస్తారో... సైకిల్, బైకు, ట్రాక్టర్, ఆటోల్లో వస్తారో మీ ఇష్టం. మీరు రావాలి. వస్తేనే జిల్లా నుంచి ఫ్యాక్షన్ భూతాన్ని తరిమికొట్టగలం అనే విషయం గుర్తుంచుకోవాలి' అని పేర్కొన్నారు.

గత ప్రభుత్వంలో శాంతి కుసుమాలు

మనందరం అభివృద్ధిని కాంక్షిస్తున్నామని, గత ఐదేళ్లు జగనన్న సంక్షేమాన్ని చూశామని ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. జగనన్న హయాంలో శాంతి కుసుమాలు ఎలా వికసించాయో అందరూ చూశారన్నారు. ఒక గొడవ కాని, హత్యకాని జరగకుండా ఐదేళ్లు పరిపాలన సాగించారన్నారు. 'కూటమి' అధికారంలోకి రాగానే రాప్తాడు నియోజకవర్గంలో దౌర్జన్యాలు, దోపిడీలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి మారణకాండను ఆపుదామా.. ఆపుదామంటే అందరూ వచ్చి జగనన్నకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. 'ఎవరో కాకమ్మ కథలు చెబుతుంటారు, కుట్రలతో సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని, 'పచ్చ' మీడియాను ఉపయోగించుకుని జగన్‌మోహన్‌రెడ్డిపైనా, నాపైనా దుష్ప్రచారం చేస్తుంటారు. కానీ ఇక్కడ బతకాల్సింది నువ్వు. జిల్లాలో శాంతిభద్రతలు కాపాడుకోవాల్సింది నువ్వు. అది నీ బాధ్యత. ఆ బాధ్యతను నిలబెట్టుకోవడానికి మంగళవారం ఉదయం 9 గంటలకు కుంటిమద్ది గ్రామానికి రావాలి' అని ఆయన పేర్కొన్నారు. శాంతి స్థాపనకు జగనన్నతో కలిసి కవాతు చేద్దామన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలు, దుర్మార్గాలను జిల్లా ఓర్చదనే సందేశం ఇద్దామని, జిల్లాను కాపాడుకుందామని విజ్ఞప్తి చేశారు.

వినియోగదారులపై గ్యాస్ బండ

- సిలిండర్‌పై రూ.50 పెంచిన ప్రభుత్వం
- జిల్లా ప్రజలపై రూ.22.92 కోట్ల భారం



అనంతపురం అర్బన్: ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరల మంటతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు అల్లాడుతున్నారు. మూలిగే నక్కపై తాడిపండు పడిన చందంగా... తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రజలపై గ్యాస్ బండ వేసింది. వంట గ్యాస్ సిలిండర్ ధరపై రూ.50 పెంచింది. పెంచిన ధర మంగళవారం నుంచి అమలులోకి రానున్నట్లు స్పష్టం చేసింది. దీంతో జిల్లాలోని గ్యాస్ వినియోదారులపై అదనపు భారం పడనుంది. ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.870గా ఉంది. సిలిండర్‌పై రూ.50 పెంచడంతో ధర రూ.920కి చేరనుంది. ఈ క్రమంలో ప్రతిసారీ జిల్లాలో గ్యాస్ వినియోగదారులపై రూ.3.82 కోట్ల అదనపు భారం పడనుంది. సగటున ఒక్కో వినియోగదారు ఏటా 6 సిలిండర్లు వినియోగిస్తారు. మొత్తంగా రూ.22.92 కోట్లు ప్రజల నుంచి పిండుకోనున్నారు.

జిల్లాలో 7.65 లక్షల కనెక్షన్లు

జిల్లాలో మొత్తం వంట గ్యాస్ కనెక్షన్లు 7,65,245 ఉన్నాయి. ఇందులో దీపం పథకం కనెక్షన్లు 2,14,970, పీఎం ఉజ్వల యోజన కనెక్షన్లు 30,355, సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ) కనెక్షన్లు 37,257, సాధారణ కనెక్షన్లు 4,82,554 ఉన్నాయి.

ఆశతో వచ్చాం.. ఆదుకోండి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల వేడుకోలు
- వివిధ సమస్యలపై 492 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివ్‌నారాయణ్ శర్మ, ఇతర అధికారులు

అనంతపురం అర్బన్: 'ఎంతో ఆశతో మీ వద్దకు వచ్చాం. కరుణించి ఆదుకోండి' అంటూ కలెక్టర్, ఇతర అధికారులను ప్రజలు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోల, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రమేష్‌రెడ్డి, తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 492 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీల పరిష్కార క్రమంలో ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. అర్జీదారునితో మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా నాణ్యతగా పరిష్కరించడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని....

- చీనీ మార్కెట్ యార్డులో ఈనామ్ వ్యవస్థను రద్దు చేసి వేలం ద్వారా అమ్మకాలు జరపాలని రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బీహెచ్‌రాయుడు, రాజారాంరెడ్డి విన్నవించారు. నిబంధనలకు విరుద్ధంగా కమీషన్ 10 శాతం వసూలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సూట్ విధానం అరికట్టాలన్నారు.
- తమ తాత పేరున ఉన్న భూమిని వేరొకరు వారి పేరున ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన తిరుపతయ్య ఫిర్యాదు చేశాడు. బుక్కరాయసముద్రం సిద్ధరాంపురం సర్వే నంబరు 336–1లో 5.08 ఎకరాలు తమ తాత పేరున ఉందని చెప్పాడు. అయితే ముగ్గురు వ్యక్తులు భూమిని తమ పేరున ఎక్కించుకున్నారని, విచారణ చేసి న్యాయం చేయాలని కోరాడు.
- గ్రామకంఠం స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నాడని గార్లదిన్నె మండలం కమలాపురానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ప్రహరీ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పాడు.
- వితంతు పింఛను మంజూరు చేయించాలని యాడికికి చెందిన కందికుంట రుక్మిణీదేవి విన్నవించింది. తన భర్తకు వృద్ధాప్య పింఛను వచ్చేదని, ఆయన గత ఏడాది జూన్ 12న చనిపోయాడని చెప్పింది. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేసింది.



- ఈ వృద్ధురాలి పేరు లక్ష్మమ్మ. ఆత్మకూరు మండల కేంద్రంలో నివాసముంటోంది. ఈమెకు నలుగురు కుమారులు సంతానం. భర్త 2016లో చనిపోయాడు. వీరికి సర్వే నంబరు 547–7లో 4.24 ఎకరాల భూమి ఉంది. భూమికి డీ పట్టా, పట్టా నంబరు 3072 పాసుపుస్తకం ఉంది. అయితే, సాగులో ఉన్న తమను భూమిలోకి వెళ్లకుండా కొందరు దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారని ఆవేదన చెందింది. కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా ఇబ్బందికి గురిచేస్తున్నారని చెప్పింది.

తప్పుడు కేసులతో ప్రాణాలు తీస్తున్నారు



రామాంజనేయులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రంగయ్య, మంగమ్మ, పార్టీ నేతలు

కళ్యాణదుర్గం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి ప్రాణాలను పొట్టనపెట్టుకుంటున్నారని పార్టీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య విమర్శించారు. టీడీపీ నాయకుల ఒత్తిడితో పోలీసులు తప్పుడు కేసు బనాయించడంతో ఆవేదనకు గురై గుండెపోటుతో కళ్యాణదుర్గం మండలం శీబావికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చాకలి రామాంజనేయులు ప్రాణాలు విడిచాడు. ఈ క్రమంలో రామాంజనేయులు మృతదేహానికి సోమవారం పార్టీ నేతలతో కలిసి రంగయ్య నివాళులర్పించారు. అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంపద సృష్టిస్తామని గొప్పలు చెప్పిన చంద్రబాబు నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారన్నారు. పోలీసులు ఏకపక్షంగా అక్రమ కేసు బనాయించడంతోనే చాకలి రామాంజనేయులు మృతి చెందాడన్నారు. వీటిపై జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఎమ్మెల్సీ బోయ మంగమ్మ మాట్లాడుతూ శీబావిలో ఎన్నడూ లేని సంస్కృతి తీసుకువచ్చారన్నారు.ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేసేవాళ్లమని, కానీ నేడు కక్షలు పెంచుకుని అమాయకుల ప్రాణాలతో టీడీపీ నాయకులు చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. రామాంజనేయులు కుటుంబాన్ని వీధిపాలు చేశారని, ఆయన భార్య, పిల్లలకు ఎవరు దిక్కని వాపోయారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు మాట్లాడుతూ చాకలి రామాంజనేయులది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనన్నారు. కళ్యాణదుర్గం రూరల్ సీఐ వంశీకృష్ణ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు ప్రైవేట్ సైన్యంలా పనిచేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, నాయకులు నారాయణపురం వెంకటేశులు, నరేంద్రరెడ్డి, మండల కన్వీనర్ గోళ్ల సూరి, చంద్రశేఖర్‌రెడ్డి, సర్వోత్తమ, గోపాల్, సూరప్ప, ఆంజనేయులు, పాతలింగ, మల్లి, మురళి తదితరులు పాల్గొన్నారు.

దయనీయం.. దౌర్భాగ్యం

- సర్వజనాస్పత్రిలో దిగజారిన సేవలు
- గంటల తరబడి ఎమర్జెన్సీలోనే రోగులు
- ప్రత్యక్ష నరకం చూస్తున్న బాధితులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



- వైద్యం కోసం సర్వజనాస్పత్రికి వచ్చిన కూడేరుకు చెందిన సంగప్ప, శెట్టూరుకు చెందిన హనుమంతులను ఒకే మంచంపై ఉంచిన దృశ్యమిది. గుండె సమస్యతో ఇబ్బంది పడుతున్న తరుణంలోనూ చాలీచాలని మంచంపై పడుకోబెట్టడం.. చాలా సేపు వైద్యులు పట్టించుకోకపోవడంతో సంగప్ప నరకయాతన అనుభవించాడు. దయచేసి వార్డుకు పంపండంటూ బోరున విలపించినా సిబ్బంది కనికరం చూపలేదు.

- కురుకుంటకు చెందిన సురేష్ సోమవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో అతడిని సిటీ స్కాన్ రూముకు తీసుకెళ్లేందుకు ఎంఎన్‌ఓలు అందుబాటులో లేరు. దీంతో కుటుంబీకులు, మిత్రులే సురేష్‌ను తరలించాల్సి వచ్చింది.పైగా స్ట్రెచర్‌కు చక్రం లేకపోవడంతో ఎత్తుకుని తీసుకెళ్లారు.



ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పార్వతమ్మ. ఆత్మకూరువాసి. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం అనంతపురం సర్వజనాస్పత్రి ఎమర్జెన్సీ వార్డుకు వచ్చింది. ఈ క్రమంలో ప్రత్యేక బెడ్డుపై ఆమెను ఉంచి సేవలందించాల్సిన డాక్టర్లు.. అప్పటికే ఓ పురుష రోగి ఉన్న మంచంపైనే పడుకోబెట్టడం విమర్శలకు దారి తీసింది.

అనంతపురం మెడికల్: అనంతపురం సర్వజనాస్పత్రిలో రోజురోజుకూ సేవలు దిగజారుతున్నాయి. ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురిని పడుకోబెడుతున్న దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయి.ఆస్పత్రికొచ్చే రోగులు ఆర్తనాదాలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే కానరావడం లేదు. అత్యవసర కేసులు ఉదయం ఎమర్జెన్సీకి వస్తే సాయంత్రమైనా వార్డులకు తరలించడం లేదు. ఉరవకొండ మండలం గడేహొతూరుకు చెందిన తులసి తలకు గాయంతో సోమవారం ఉదయం 11.30 గంటలకు సర్వజనాస్పత్రికి రాగా, ఇక్కడ ఆమెను సర్జరీ వైద్యులు చూడడానికి దాదాపు 4 గంటల సమయం పట్టింది. ఇదొక్కటే కాదు..ఆస్పత్రిలో తగినన్ని పడకలు లేకపోవడం, వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యం వెరసి సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులు నానా అవస్థలు పడుతున్నారు. దిక్కుతోచని స్థితిలో ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. రోజులో ఒక్కసారైనా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఏడీ మల్లికార్జున రెడ్డి, ఆర్ఎంఓలు ఎమర్జెన్సీ వార్డును పరిశీలించి రోగులను సకాలంలో వార్డులకు పంపేలా చూస్తే సగం కష్టాలు తీరుతాయి. కానీ ఆస్పత్రిలో అటువంటి పరిస్థితి లేకుండా పోయింది.

అమాత్యా.. ఆలకించండి..

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఎమర్జెన్సీ వార్డును పది నిమిషాలు పరిశీలిస్తే.. ఇక్కడ రోగులు నిత్యం ఎంత నరకం అనుభవిస్తారో తెలుస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు. ఆస్పత్రిలో వివిధ విభాగాధిపతులు, అధికారుల మధ్య ఏపాటి సమన్వయం ఉందో, సూపరింటెండెంట్, ఏడీ, ఆర్ఎంఓలకు పరిపాలనపై పట్టు ఏమాత్రం ఉందో ఇట్టే తెలిసి పోతుందంటున్నారు.

క్లుప్తంగా

'పీపీపీ'తో పేదలకు వైద్య సేవలు దూరం



పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ సంతకం చేస్తున్న డాక్టర్ గేయానంద్

అనంతపురం కార్పొరేషన్: పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానం ద్వారా పేదలకు వైద్య సేవలు శాశ్వతంగా దూరమవుతాయని, ఈ విధానం కింద ప్రభుత్వ ఆస్పత్రులను చేర్చే ఆలోచనను మానుకోకపోతే ఉద్యమిస్తామంటూ కూటమి ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హెచ్చరించారు. పీపీపీ పద్ధతిని వ్యతిరేకిస్తూ ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అత్యధికంగా పేదలకు సర్వజనాస్పత్రినే దిక్కుగా మారిందన్నారు. ప్రైవేట్ కంపెనీలను భాగస్వామ్యం చేసుకుంటే పేదలకు నాణ్యమైన వైద్యం అందదన్నారు. హెల్త్ కేర్ సెక్టార్‌కు సంబంధించి బడ్జెట్‌లో 5 శాతం నిధులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రత్యేకంగా నిధులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసూన, డాక్టర్ వీరభద్రయ్య, నాయకులు రాజు, తిరుపాల్, చంద్రశేఖర్, సురేంద్ర, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై రంగనాథుడు



తాడిపత్రి: ఆలూరు కోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి సింహ వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. రంగనాథస్వామిని ప్రత్యేక పూలు, ఆభరణాలతో అర్చకులు అలంకరించారు. రాత్రి సింహ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను కొలువు దీర్చి అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

పేదోడి రైలు.. రైల్వేకు అలుసు



డెమో రైలులో ప్రయాణిస్తున్న దృశ్యం

పేద, మధ్య తరగతి ప్రయాణికులకు అనుగుణంగా మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ (ఎంఎంటీఎస్ – డెమో ప్యాసింజర్) రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ప్రవేశపెట్టింది. వీటితో తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించేందుకు అవకాశం ఏర్పడుతుంది. అయితే డెమో రైళ్లలో ఎలాంటి మౌలిక వసతులు లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- డెమో ప్యాసింజర్ రైళ్లతో ప్రయాణికుల బేజారు
- మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేక ఇబ్బందులు
- జనరల్ బోగీలతో నడపాలని ప్రయాణికుల డిమాండ్

గుంతకల్లు: డివిజన్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నడుస్తున్న డెమో ప్యాసింజర్ రైళ్లతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గుంతకల్లు–హిందూపురం (77213/14), గుంతకల్లు–రాయచూర్ (77201/02), గుంతకల్లు–డోన్ (77203/04), డోన్–గుత్తి (77205/06), నంద్యాల–రేణిగుంట (77212/11), కర్నూలు సిటీ–నంద్యాల (77209/10) మధ్య నడుస్తున్న డెమో ప్యాసింజర్ రైళ్లలో రాయలసీమ జిల్లా వాసులు తక్కువ ధరతో ప్రయాణం చేయడానికి ఎంతో అనువుగా ఉన్నాయి. దీంతో మధ్య తరగతి, గ్రామీణ ప్రాంతా ప్రయాణికులు ఈ రైళ్ల వైపు మొగ్గు చూపారు. మౌలిక వసతులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

వసతులు కరువు

హైదరాబాదు, బెంగుళూరు తదితర నగరాల్లో నడుతువున్న ఎంఎంటీఎస్ రైళ్ల (డెమో)ను రైల్వేశాఖ సాధారణ ప్రయాణికుల కోసం గుంతకల్లు డివిజన్ లోపి పలు ప్రాంతాల నుంచి నడుపుతోంది. ట్రాఫిక్ సమస్య తలెత్తకపోవడంతో పాటు సమయానికి నిర్దేశించిన గమ్యస్థానానికి చేరుకోవచ్చు. దీంతో సిటీ ప్రజలు ఎక్కువగా ఈ రైళ్లలోనే ప్రయాణిస్తుంటారు. ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్ వెళ్లడానికి 5 నిమిషాల సమయం కూడ పట్టదు. 700ల మంది కూర్చొని, మరో వెయ్యి మందికి పైగా నిల్చొని ప్రయాణం చేసే వెసులుబాటు ఉంది. దీంతో ఈ రైళ్లలోని బోగీల్లో టాయిలెట్లు, నీటి వసతి అనేవి ఉండవు.

గుంతకల్లు–హిందూపురం మధ్య నడస్తున్న డెమో ప్యాసింజర్ రైలు దాదాపు 200 కి.మీ.లు ప్రయాణించాల్సి ఉంది. గుంతకల్లు నుంచి సాయంత్రం 4 గంటలకు బయలుదేరిన రైలు హిందూపురానికి రాత్రి 10 గంటలకు చేరుకుంటుంది. ఈ క్రమంలో ప్రయాణికులు టాయిలెట్‌కు వెళ్లాలంటే వీలు పడదు. బోగీల్లో టాయిలెట్లు, నీటి సౌకర్యం లేకపోవడంతో గంటల తరబడి వృద్ధులు, మహిళలు చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్‌లో నిలబడిన వెంటనే రైలు దిగి టాయిలెట్ల వైపు పరుగు తీస్తున్నారు. ఈ లోపు రైలు వెళ్లిపోవడంతో సమస్యల్లో చిక్కుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రైలు మిస్ అయిన ప్రయాణికులు స్టేషన్ మాస్టర్లతో గొడవకు దిగిన సందర్భాలు చాలా ఉన్నాయి.

ప్యాసింజర్లు అంటే చులకన...

పేదోడి రైళ్లు (ప్యాసింజర్) అంటే రైల్వేశాఖకు చులకనై పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడ్స్ రైళ్లపై ఉన్న శ్రద్ధ ప్యాసింజర్ రైళ్లపై లేదని విమర్శిస్తున్నారు. గుంతకల్లు–గుత్తి. గుత్తి–ధర్మవరం మధ్య డబుల్‌లైన్ పూర్తయింది. ఈ మార్గంలో ఒకేసారి రెండు రైళ్ల పరుగులు పెడుతాయి. అయితే గూడ్స్ రైళ్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు పరుగులు పెడుతున్న సమయంలో డెమో రైళ్లను ఎక్కడ పడితే అక్కడ నిలిపి వేస్తున్నారు. దీంతో ఈ రైళ్ల సరైన సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి ఎండలకు రైళ్లలో ఉక్కపోతకు చిన్నారులు, వృద్ధులు తాళలేకపోతున్నారు.

సాధారణ బోగీలతో నడపాలి



డివిజన్ వ్యాప్తంగా నడుపుతున్న డెమో రైళ్ల స్థానంలో సాధారణ బోగీలతో ఉన్న ప్యాసింజర్ రైళ్లను నడపాలి. ఈ సాధారణ బోగీల్లో టాయిలెట్లు, నీటి సౌకర్యం ఉంటుంది. డెమో రైళ్లతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను రైల్వేశాఖ గుర్తించాలి. డెమో రైళ్లను సిటీలకే పరిమితం చేయాలి.

– అనంత శేషారెడ్డి, గుంతకల్లు

వైభవంగా 'వేమన' ఉత్సవాలు



చాందినీ బండిని ఊరేగిస్తున్న దృశ్యం

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లిలో రెండో రోజు సోమవారం రాత్రి విశ్వకవి యోగి వేమన ఉత్సవాలు వైభవంగా సాగాయి. పీఠాధిపతి నందవేమారెడ్డి ఆధ్వర్యంలో వేమన సమాధిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. కదిరి పరిసర మండలాల నుంచే కాక వైఎస్సార్ జిల్లా, కర్నూలు, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వేమన ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులకు పీఠాధిపతి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాటల కచేరీ అలరించింది.



ఉత్సవాలకు హాజరైన జనం

'స్టార్' తిరగబడింది!

- తాడిపత్రిలో బోర్డు తిప్పేసిన ఫైనాన్స్ సంస్థ
- రూ.6 లక్షలతో ఉడాయించిన సంస్థ ఇన్‌చార్జ్ భాస్కర్
- సంస్థ సిబ్బందిని నిలదీస్తున్న బాధితులు
- పోలీసులను ఆశ్రయించిన సిబ్బంది, బాధితులు



స్టార్ ఫైనాన్స్ సంస్థ కార్యాలయం



ఏఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఫైనాన్స్ సంస్థ సిబ్బంది

తాడిపత్రి టౌన్: 'బిజినెస్ చేయాలనుకున్నారా?. సొంత ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు లేక ఆగిపోయారా? ఇప్పుడు మీ కలలను సాకారం చేసేందుకు స్టార్ ఫైనాన్స్ మీ ముందుకు వచ్చింది. సిబిల్ స్కోర్ లేకున్నా మీకు రుణం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం' అంటూ ఊరించి నెల రోజులు తిరగకుండానే బాధితులకు రూ.6 లక్షల కుచ్చుటోపీ పెట్టి తాడిపత్రిలో ఓ ఫైనాన్స్ సంస్థ బోర్డు తిప్పేసింది. వివరాలు... తాడిపత్రి మండలం కొండేపల్లికి చెందని సాగిబండ భాస్కర్... స్థానిక నంద్యాల రోడ్డులో ఓ గదిని అద్దెకు తీసుకుని స్టార్ ఫైనాన్స్ పేరుతో కార్యాలయాన్ని ఏర్పాటు చేశాడు. సిబిల్ స్కోర్ లేకపోయినా వ్యక్తిగత రుణాలు, బిజినెస్ లోన్లు, హౌస్.. ప్లాట్ లోన్లు ఇస్తామంటూ ఆకర్షణీయమైన ఫ్లెక్సీలో విస్తృత ప్రచారం చేశాడు. నెలకు రూ.10వేల వేతనంతో దాదాపు 20 మంది సిబ్బందిని నియమించుకుని ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వారిపై ఉసిగొల్పాడు. ఎదుటి వ్యక్తి అవసరాలను బట్టి రుణం మంజూరుకు సంబంధించి రూ.లక్షకు 6 శాతం చొప్పున ప్రాసెసింగ్ ఫీజును ముందుగానే రాబట్టుకున్నాడు. ఇలా దాదాపు 35 మందితో రూ.6 లక్షలు వసూలు చేసుకుని 30 రోజుల్లోపు రుణం మొత్తం వారి బ్యాంక్ ఖాతాలకు జమ అవుతుందని నమ్మబలికాడు. దాదాపు నెల రోజులకు పైగా గడుస్తున్నా బ్యాంక్ ఖాతాలకు రుణం మొత్తం జమ కాకపోవడంతో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన పలువురు నేరుగా కార్యాలయానికి చేరుకుని అక్కడున్న సిబ్బందిని నిలదీశారు. దీంతో రేపోమాపో వస్తుందని చెబుతూ వచ్చిన సిబ్బంది సైతం ఫైనాన్స్ సంస్థ నిర్వాహకుడు భాస్కర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో లబోదిబోమంటూ బాధితులతో కలసి సోమవారం ఏఎస్పీ రోహిత్‌కుమార్‌కు సమస్య విన్నవించారు. ఘటనపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

రైతులను ఆదుకోవాలి

- హంద్రీ–నీవా లైనింగ్ పనులు ఆపాలి
- కలెక్టర్‌కు విన్నవించిన ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకులు



కలెక్టర్ వినోద్‌కుమార్‌తో మాట్లాడుతున్న అభివృద్ధి వేదిక నాయకులు

అనంతపురం అర్బన్: జిల్లాలో గత ఏడాది అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, అన్నదాతలను ఆదుకునేందుకు అన్ని మండలాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించేలా ప్రభుత్వానికి నివేదిక అందిచాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకులు విన్నవించారు. ఈ మేరకు కలెక్టర్‌ను సోమవారం రెవెన్యూభవన్‌లో వేదిక జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీరమణ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాములు, మధు, కార్యదర్శులు ఆదినారాయణ, హరి కలసి వినతి పత్రం అందజేసి, సమస్య వివరించారు. హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ పనులు చేయడం ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. లైనింగ్ పనుల ద్వారా కాంట్రాక్టర్లకు తప్ప రైతులకు ఏ మాత్రం లాభదాయకం కాదన్నారు. తక్షణమే లైనింగ్ పనులు నిలిపివేయాలని కోరారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి 15 శాతం పెరగాలన్నారు. మూతపడిన పరిశ్రమలను పునరుద్ధరించడంతో పాటు కొత్త పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. తమ ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి అమలుకు చర్యలు తీసుకోవడం ద్వారా జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు.

జగన్‌ను అడ్డుకునే ధైర్యం మాకుంది

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వివాదాస్పద వ్యాఖ్యలు

రాప్తాడురూరల్: 'వైఎస్ జగన్‌ను రాకుండా అడ్డుకునే దమ్ము, ధైర్యం మాకున్నాయి. మాలో పరిటాల, చంద్రబాబు, టీడీపీ బ్లడ్ ఉంది. ఆయన ఇక్కడ దిగకుండా తిరిగి పంపే శక్తీ ఉంది' అంటూ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆమె రామగిరి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పర్యటనకు వచ్చే జగన్.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా బాధిత కుటుంబానికి సాయం చేయాలన్నారు. టీడీపీ నేతలు సంయమనంతో వ్యవహరించాలని కోరారు.

'పోలీసు స్పందన'కు 80 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 80 వినతులు అందాయి. ఎస్పీ పి.జగదీష్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు.

సైనిక లాంఛనాలతో జవాన్‌కు అంత్యక్రియలు



అనిల్‌కుమార్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సైనికోద్యోగి

పామిడి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఆర్మీ జవాన్ కొండేటి అనిల్‌కుమార్(36)కు సైనిక లాంఛనాలతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు... పామిడి మండలం ఎదురూరుకు చెందిన అనిల్‌కుమార్ అహమ్మదాబాద్ రెజిమెంట్‌లో హవల్దార్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య రమావత్ పార్వతి, 12 ఏళ్ల వయసున్న సాయితేజ, తొమ్మిదేళ్ల వయసున్న మోక్షిత్ అనే కుమారులు ఉన్నారు. పిల్లల చదువుల కోసమని అనంతపురంలో కాపురం పెట్టిన ఆయన గత నెల సెలవుపై ఇంటికి వచ్చారు. ఈ నేపథ్యంలో మార్చి 19న ద్విచక్ర వాహనంపై వెళుతూ అనంతపురంలోని రుద్రంపేట సమీపంలో స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనం అదుపు తప్పి కిందపడడంతో తలకు తీవ్ర గాయమై కోమాలోకి పోయారు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు బెంగుళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి ఆయన మృత్యుఒడికి చేరుకున్నారు. దీంతో ఆయన భౌతిక కాయాన్ని సోమవారం సాయంత్రం స్వగ్రామం ఎదురూరుకు సైనికులు తీసుకువచ్చారు. అదే రోజు రాత్రి 7 గంటల సమయంలో అహమ్మదాబాద్ రెజిమెంట్ అధికారుల సమక్షంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, తహసీల్దార్ ఎన్. శ్రీధరమూర్తి, సీఐ వి.యుగంధర్, మాజీ సైనికోద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకోం

- ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రామగిరి మండల పర్యటనను అడ్డుకోవాలని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ నిర్ణయించలేదని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మందకృష్ణ నాయకత్వంలోని ఎమ్మార్పీఎస్‌కు సంబంధం లేని వ్యక్తులు ఎవరైనా అలాంటి అడ్డుకునే ప్రకటనలు చేస్తే స్పందించాల్సిన అవసరం లేదన్నారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌కు ఎక్కడైనా పర్యటించే స్వేచ్ఛ ఉందన్నారు.

మద్దతు ధరతో జొన్నల సేకరణ : జేసీ

అనంతపురం అర్బన్: మద్దతు ధరతో జొన్నల సేకరణ చేపట్టనున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైబ్రీడ్ రకం క్వింటా రూ.3,371, మల్దండి రకం క్వింటా రూ.3,431తో కొనుగోలు చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విడపనకల్లులో 'ప్రత్యేక గ్రీవెన్స్'

అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం' కింద ప్రత్యేక గ్రీవెన్స్‌ను మంగళవారం విడపనకల్లు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొలాల్లో రేషన్ బియ్యం డంప్



ఆటోలో తెచ్చిన రేషన్ బియ్యాన్ని డంప్ చేస్తున్న దృశ్యం

పామిడి: మండలంలోని తంబళ్లపల్లి గ్రామ పొలాల్లో కొందరు అక్రమార్కులు పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని డంప్ చేశారు. పేదల ఆకలి తీర్చాల్సిన బియ్యాన్ని కొందరు యథేచ్ఛగా నల్లబజారులో అధిక ధరతో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తంబళ్లపల్లి గ్రామంలోని పాత గంగమ్మ గుడి సమీపంలోని పొలాల్లో సోమవారం నాటికి 70 బస్తాల బియ్యాన్ని కొందరు గుట్టు చప్పుడు కాకుండా డంప్ చేశారు. కొన్ని రోజులుగా ఆటోలో బియ్యాన్ని తీసుకువచ్చి అక్కడ డంప్ చేస్తున్నట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

నేత్రపర్వంగా రథోత్సవం



యణ్ణేరంగస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామంలో వెలసిన యణ్ణేరంగస్వామి రథోత్సవం సోమవారం నేత్రపర్వంగా సాగింది. రాయదుర్గం, బొమ్మనహాళ్, బెళుగుప్ప, డి.హిరేహాళ్ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. ఉదయం నుంచి సాయంకాలం వరకూ విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. సాయంకాలం 5 గంటలకు స్వామి ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగిస్తూ రథంపైకి చేర్చారు. మేళతాళాలు, తప్పెట్లతో రథాన్ని ముందుకు లాగారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యండ్రకాయల వన్నూరప్ప, మాజీ వైస్ ఎంపీపీ పి.సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కెనిగుంట రామిరెడ్డి, పాటిల్ వెంకటరెడ్డి, కె.జె.ఈరన్న, కేజీ వన్నూరుస్వామి, హనుమంతప్ప పాల్గొన్నారు. కాగా, రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన యణ్ణేరంగస్వామి ఉత్సవాలు సోమవారం నాటి రథోత్సవంతో ముగిసాయి.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. మృతులందరూ మూడు పదుల వయసు దాటని వారు కావడం గమనార్హం. వివరాలు...

- **గార్లదిన్నె:** మండలంలోని మర్తాడుకు చెందిన మహేష్ (27) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన రామాంజనేయులు, వెంకటేశ్వరమ్మ దంపతులకు మగ కవల పిల్లలు, ఓ కుమార్తె ఉన్నారు. కవలల్లో పెద్ద కుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, రెండో కుమారుడు మహేష్ బీటెక్ పూర్తి చేశాడు. కొన్నేళ్లుగా మానసిక సమస్యతో ఇబ్బంది పడుతుంటే తల్లిదండ్రులు చికిత్స చేయిస్తున్నారు. దాదాపు 8 ఏళ్లుగా మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం మర్తాడు క్రాస్ సమీపంలో ఉన్న తమ పొలానికి తల్లితో కలసి మహేష్... అక్కడ ఊయల కోసం చెట్టుకు కట్టిన చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన తల్లి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లోని రైతులు అక్కడకు చేరుకుని కాపాడే లోపు మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.
- **తాడిపత్రి:** మండలంలోని కోమలి – తాడిపత్రి రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం తెల్లవారుజామున పులిచెర్ల నారాయణస్వామి (24) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామానికి చెందిన నారాయణస్వామి ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. సోమవారం పట్టాలపై పడి ఉన్న నారాయణస్వామి మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.
- మరో ఘటనలో తాడిపత్రి రూరల్ పరిధిలోని చల్లవారిపల్లి – తాడిపత్రి రైల్వే లెవల్ క్రాసింగ్ సమీపంలో ఆదివారం రాత్రి నవీన్ కుమార్ (30) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తాడిపత్రిలోని పోరాటకాలనీకి చెందిన నవీన్‌కుమార్ లగేజీ ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తితో ఆదివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపారు.

క్లుప్తంగా

ముగిసిన వసంత నవరాత్రి ఉత్సవాలు



విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకూ తొమ్మిది రోజులుగా నగరంలోని శివబాలయోగి ఆశ్రమం వేదికగా సాగిన వసంత నవరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. తెల్లవారు జామునే అనంతేశ్వరి దేవతకు పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు, ప్రసాద నివేదన జరిగాయి. అమ్మవారి స్తుతి, భక్తిగీతాలాపనలతో అమ్మవారి నామస్మరణ చేశారు. ఆశ్రమ మహిళా మండలి ఆధ్వర్యంలో సామూహిక శ్రీమణిద్వీప వర్ణన, పారాయణం తొమ్మిది పర్యాయాలు చేసి మహా పారాయణంతో వేడుకలను ముగించారు. శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రం పారాయణం అనంతరం ఆశ్రమంలో కొలువుదీరిన వివిధ దేవతల విగ్రహాల ఊరేగింపు, పల్లకీ సేవ నిర్వహించారు. 33 రకాల పూలతో అమ్మవారిని అలంకరించి ఆరాధించారు. ఉత్సవాల నిర్వహణకు సహకారం అందించిన భక్తులను సన్మానించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్, ప్రసాద్, మల్లికార్జున, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ల పంపిణీ

అనంతపురం: ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్‌లో 30 మంది పోలీసు సిబ్బందికి అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు సోమవారం ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఇటుకలపల్లి సీఐ హేమంత్ కుమార్, ఎస్ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పన్నుపై 5 శాతం రాయితీ

అనంతపురం కార్పొరేషన్: ఇంటి పన్ను ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ వర్తిస్తుంది. అసెస్‌మెంట్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కమిషనర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెలాఖరు వరకు రాయితీకి అవకాశం ఉందని తెలిపారు. నగరపాలక సంస్థలోని కౌంటర్లతో పాటు నగరంలోని వేణుగోపాల్ నగర్‌లో ఉన్న 5వ సచివాలయం, పాతూరులో ఉన్న 17వ సచివాలయం, నవోదయ కాలనీలోని 40వ సచివాలయం, శ్రీనగర్ కాలనీలోని 52వ సచివాలయం, రాంనగర్‌లోని 54వ సచివాలయం రెండరోడ్డు స్టడీ పార్క్ పక్కన ఉన్న 64వ సచివాలయంలో పన్ను చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

గ్యాస్ ధర పెంపు దుర్మార్గం

అనంతపురం అర్బన్: కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ విమర్శించారు. గృహ సిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణమన్నారు. పెంచి గ్యాస్ ధరను తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఉక్రెయిన్ యుద్ధ సమయంలో రష్యా నుంచి చౌకగా ముడి చమురు వస్తే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించకుండా అంబానీ రూ.లక్షల కోట్లు దోచుకోవడానికి కారణమయ్యారన్నారు. ఒకవైపు మత భావాలను రెచ్చగొడుతూ మరోవైపు ప్రజలపై భారాలు వేయడం బీజేపీ విధానమని విమర్శించారు. ఇప్పటికే దేశంలో ప్రజల కొనుగోలు శక్తిపడిపోతున్న దశలో గ్యాస్ ధర పెంచడం ప్రజల నెత్తిన బండ వేయడమే అని మండిపడ్డారు.

రైల్వే స్టేషన్‌లో వృద్ధురాలి మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనంతపురం సిటీ: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ నాల్గో ప్లాట్‌ఫాం పక్కన నిర్మాణంలో ఉన్న భవనంలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలి(70) మృతదేహాన్ని సోమవారం ఉదయం గుర్తించినట్లు జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయ, నీలం ఆకుపచ్చ రంగు కలిగిన చీర, గులాబీ రంగు జాకెట్టు, ఊదా రంగు పెట్టి కోట్ ధరించినట్లుగా తెలిపారు. ఇంతకు మించి ఎలాంటి ఆధారాలు మృతురాలి వద్ద లేవన్నారు. మృతదేహాన్ని సర్వజనాస్పత్రికి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27662 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

సురేష్‌కు ఉగాది పురస్కారం

అనంతపురం కల్చరల్: హైదరాబాద్‌లో అక్షయ సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారు రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో ప్రసిద్ధులైన వారికి సోమవారం ఉగాది అవార్డులు అందజేశారు. నగరానికి చెందిన సీనియర్ నాట్యాచార్యుడు సురేష్ ఉగాది పురస్కారం అందుకున్నారు. సిటీ డీసీపీ రామదాసు తేజావత్, అక్షయ ఫౌండేషన్ నిర్వాహకులు సీతారామ్ తదితరులు సురేష్ మాస్టర్‌ను ఘనంగా సత్కరించారు. గత 33 ఏళ్లుగా ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు.

ఇష్టారాజ్యం

- మదర్ మిల్క్ బ్యాంక్ పనుల్లో నిర్లక్ష్యం
- పాత టైల్స్, షీట్లు వేసిన కాంట్రాక్టర్
- నాసిరకం మెటీరియల్ వినియోగం
- పట్టించుకోని అధికారులు
- కాంట్రాక్టర్‌కు రూ.లక్షల్లో లబ్ధి



మదర్ మిల్క్ బ్యాంక్‌లో పాత టైల్స్ వేసిన దృశ్యం

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధుల ఆశీస్సులతో అందినకాటికి అందినంత దోచుకుంటున్నారు కాంట్రాక్టర్లు. చివరకు చిన్నారుల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న అభివృద్ధి పనులను వదలడం లేదంటే ఇంతకన్నా దారుణం ఎక్కడుంటుందని చెప్పాలి. అందుకు నిలువెత్తు సాక్ష్యమే ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేస్తున్న మదర్ మిల్క్ బ్యాంక్. ఈనెల 8న (మంగళవారం) వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ఈ బ్యాంక్‌ను ప్రారంభించనున్నారు. మంత్రితో ప్రారంభించే పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సర్వజనాస్పత్రికి మదర్ మిల్క్ బ్యాంక్ మంజూరైంది. ఎన్నికలు రావడంతో ఈ పనుల్లో జాప్యం జరిగింది. కూటమి ప్రభుత్వంలో మదర్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు తెరపైకి వచ్చింది. కాగా తాడిపత్రికి చెందిన అర్జాస్ స్టీల్స్ సౌజన్యంతో మదర్ మిల్క్ బ్యాంక్‌లో పరికరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

రూ.10 లక్షలతో సివిల్ పనులు

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఎంపీ నిధులు రూ.10 లక్షలతో సివిల్ పనులు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ ఎదురుగా ఉన్న చిన్న గదిలో మదర్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనుల్లో నూతన టైల్స్, మూడు ఏసీలు, ప్రత్యేక క్యాబిన్‌లు ఏర్పాటు చేయాలని టెండర్‌లో పొందుపర్చారు. కాగా సదరు కాంట్రాక్టర్ కక్కుర్తితో ఆస్పత్రిలో ఇది వరకే ఉన్న టైల్స్‌ను (అధిక శాతం) ఉంచేశాడు. కిటికీల వద్ద షీట్లు వేసి పైపై మెరుగులు దిద్దాడు. టైల్స్ వివిధ రంగుల్లో ఉండటంతో అసహ్యంగా కనిపిస్తోంది. కొత్త టైల్స్ వేసినా అందులో నాణ్యత లేనట్లు సమాచారం. క్యాబిన్‌లకు వేసిన మెటీరియల్ గేజ్ లేదని.. నాసిరకంగా ఉన్నాయని ఆస్పత్రి వర్గాలు చర్చించుకుంటున్నాయి. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులు చేస్తుండటంతో కాంట్రాక్టర్‌కు భారీగా లబ్ధి చేకూరే అవకాశం ఉందని చెప్పాలి.

అధికారుల ప్రేక్షకపాత్ర

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేసినా.. సదరు అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పర్యవేక్షించే ఏఈ లోకేష్ పనులను పర్యవేక్షించడం లేదు. ఆయన చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం చర్చనీయాంశమైంది. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి వర్గాలు కోరుతున్నాయి.

శోభాయమానం.. శ్రీరాముడి పట్టాభిషేకం



నగర వీధుల్లో ఊరేగుతున్న సీతారాములు



పూజలు చేస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవ వేడుకలు పలుచోట్ల ఘనంగా జరిగాయి. స్థానిక గీతామందిరంలో వేదపండితులు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. సముద్ర, నదీ జలాల అవగాహన, సీతా అష్టోత్తరం, సామూహిక రామనామ పారాయణం అనంతరం పరుచూరి రమేష్ ఆధ్వర్యంలో శ్రీరాముడి పట్టాభిషేకాన్ని వేడుకగా జరిపించారు. సంప్రదాయ కిరీటధారణ, విల్లంబులు స్వామికి అర్చకుల ద్వారా అందించి పూజలు చేశారు. స్వామికి నివేదించిన ఆహార పదార్థాలను సీతారాములకు సమర్పించిన అనంతరం భక్తులకు వితరణ చేశారు. విశిష్ట వ్యాఖ్యాతగా విచ్చేసిన డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి రామాయణాన్ని ఈనాటి పరిస్థితులకు అనుగుణంగా వర్ణించిన తీరు, పలు కీలక ఘట్టాల రామాయణ వ్యాఖ్యానం ఆకట్టుకుంది. అలాగే ద్వారకా విలాస్ రోడ్డులోని సీతారామాలయంలో నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వసంతోత్సవం నిర్వహించారు. ట్రస్టు ప్రతినిధులు డాక్టర్ నిర్మల, పురుషోత్తమ మురళీకృష్ణ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

సింహ వాహనంపై శ్రీరాముడి విహారం

అనంతపురం కల్చరల్: శ్రీశైలాన్ని తలపిస్తూ నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం వేదికగా శ్రీరామనవమి ఉత్సవాలు నేత్రానందంగా సాగుతున్నాయి. భక్తుల శ్రీరామ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం రాత్రి సీతారాములు సింహ వాహనంపై మహావిష్ణు రూపంలో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు హర్షశర్మ తదితరులు శ్రీరాముడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కళాకారుల భజనలతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాకేతపురం శోభ, ఆలయ భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

రాప్తాడు: వేగ్రామాల్లో తాగునీటి సమస్య రానీయొద్దని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఏయే గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్నాయో తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. సమస్య అధికంగా ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. ఈ రెండు నెలలు మండల ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం అందేలా చూడాలన్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు. కింది స్థాయి సిబ్బంది హాజరైతే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకూ తహసీల్దార్ రాలేదని, సమస్యలను చెబితే కింది స్థాయి సిబ్బంది పరిష్కరించడం లేదని ప్రజా ప్రతినిధులు తెలిపారు. వచ్చే సమావేశానికి అయినా తహసీల్దార్ వచ్చేలా చూడాలని కోరారు. ఆర్టీసీ బస్సులు రాప్తాడు మీదుగా వెళ్లకుండా బైపాస్ మీదుగా వెళ్తున్నాయని, రాప్తాడు మీదుగా వెళ్లేలా చూడాలని కోరారు. రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసి నెలలు దాటినా వైర్ పంపిణీ చేయలేదని పలువురు ఎంపీటీసీలు తెలిపారు. ప్రహరీ లేని అంగన్‌వాడీలను గుర్తించి వాటికి ప్రహరీలు ఏర్పాటు చేయాలనానరు. ముస్లిం మైనార్టీ కాలనీ, కళాకారుల కాలనీలకు అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు అయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మన్నల వరలక్ష్మి, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లింపులో అన్యాయం



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సమస్యలను వివరిస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: జాతీయ రహదారి 544డీ విస్తరణ క్రమంలో ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం చెల్లింపులో అన్యాయం జరిగిందని రైతు సంఘం నాయకులు, నిర్వాసితులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు బీహెచ్ రాయుడు, రాజారాంరెడ్డి, ఎర్రగుంటపల్లి మాజీ సర్పంచ్ యుగంధర్, తదితరులు కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2024లో నిర్వహించిన గ్రామసభలో ప్రకటించిన ధరల మేరకు పరిహారం ఇవ్వలేదన్నారు. నిర్ణయించిన దాని కంటే తక్కువగా ఖాతాల్లో జమ చేసి నిర్వాసితులకు అన్యాయం చేశారన్నారు. దీనిపై రీసర్వే చేయించి ఆస్తినష్టం అంచనా వేయించి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నవీన్‌గాంధీ, వెంకటరంగయ్య, నారాయణ స్వామి, నవీన్ కుమార్, గంగాధర్, రాజశేఖర్ రెడ్డి, ప్రసాద్, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని యువజన నగర్‌లో పర్యటించారు. స్పందనలో సమస్యను తెలియజేసిన ఫిర్యాదుదారుడు సంపత్‌కుమార్ ఇంటికి కలెక్టర్ వెళ్లారు. అర్జీదారుడి సమస్యను పరిష్కరిస్తూ.. కలెక్టర్ స్వయంగా ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. పీజీఆర్ఎస్ సర్వేపై జిల్లా కలెక్టర్ ఎంప్లాయ్ మొబైల్ యాప్‌లో వివిధ సర్వేలు వర్క్ ఫ్రమ్ హోం, అప్డేట్ ఈకేవైసీ, అప్డేట్ మొబైల్ నెంబర్, రైస్ కార్డు ఈ–కేవైసీ తనిఖీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, వీఆర్ఓ పద్మజ, వెల్ఫేర్ కార్యదర్శి విమల తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజానికి పాటుపడదాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం కార్పొరేషన్: ఆరోగ్యకరమైన సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకూ అక్కడి నుంచి డీఎంహెచ్ఓ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత వైద్యాధికారులు, సిబ్బందిదే అన్నారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా కేన్సర్, టీబీ, కుష్టు, బీపీ, మధుమేహం తదితర నివారణకు కృషి చేయాలన్నారు. మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నారాయణ స్వామి, జిల్లా మలేరియా అధికారి ఓబులు, డెమో త్యాగరాజు, ఆరోగ్య విద్యాధికారి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పర్యటన జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: 'గడిచిన ఐదేళ్ల కాలంలో ఫ్యాక్షన్ అనేది ఉండకూడదని అప్పటి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోంది. ఈ ప్రభుత్వానికి చమరగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని' ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, వైస్ ఎంపీపీ మన్నల వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సాకే వెంకటేష్ అన్నారు. టీడీపీ నేతల దాడిలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం రామగిరి మండలం పాపిరెడ్డి పల్లికి వస్తారని తెలిపారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాప్తాడులో వెయ్యి బైక్‌లతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ రెడ్డి, ఎంపీటీసీ రాముడు, మాజీ మండల యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, సింగారప్ప, మన్నల రవికుమార్ పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితాలో పండిట్లు గల్లంతు

- డీఈఓకు ఫిర్యాదు చేసిన రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎల్‌టీఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్లకు పదోన్నతులకు సంబంధించి విద్యాశాఖ తయారు చేసిన తాత్కాలిక సీనియార్టీ జాబితాలో పలవురు భాషా పండితుల పేర్లు గల్లంతయ్యాయి. దీనిపై రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) నాయకులు అసహనం వ్యక్తం చేస్తూ సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు వై.ఆదిశేషయ్య, ప్రధానకార్యదర్శి జి.వేణుగోపాల్ మాట్లాడుతూ... ఉమ్మడి అనంతపురం జిల్లాలో భాషా పండితుల ఉన్నతీకరణ పదోన్నతుల అనంతరం మిగులు పండితులు శాశ్వత స్థానాలు లేక ఎస్జీటీ స్థానాల్లో పని చేస్తున్నారన్నారు. మొత్తం 88 మంది మిగులు టీచర్లుగా ఉండగా ప్రస్తుతం ప్రకటించిన సీనియార్టీ జాబితాలో 63 మంది పండిట్ల వివరాలు మాత్రమే చూపించారన్నారు. మిగిలిన 25 మంది పండిట్ల వివరాలు కనిపించకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారన్నారు. గల్లంతయిన భాషా పండితుల వివరాలను సేకరించి పదోన్నతుల సీనియార్టీ జాబితాలో చేర్చాలని కోరారు. దీనిపై స్పందించిన డీఈఓ మాట్లాడుతూ... పరిశీలించి అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

రాప్తాడురూరల్: అక్రమార్కుల నుంచి కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురం రూరల్ తహసీల్దార్ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్, సీపీఎం రాప్తాడు ప్రాంతీయ కార్యదర్శి టి.రామాంజనేయులు మాట్లాడారు. అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి సర్వే నంబర్లు 248/1సి1, 248/1సి2 ప్రభుత్వ భూమి దాదాపు 9.47 ఎకరాలు ఉందన్నారు. ఈ భూమిని అన్యాక్రాంతం చేసి పాసు బుక్కు, రిజిస్టర్ చేసుకున్నారన్నారు. భూ అక్రమణ కేసులు నమోదు చేసి జైలు పంపాలన్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమి అక్రమాలకు పాల్పడి కొంతమంది బ్రోకర్లకు సహకరించిన రెవెన్యూ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

నేడు పాండురంగడి స్పర్శ దర్శనం

అనంతపురం కల్చరల్: రామనగర్‌లో వెలసిన రుక్మిణి పాండురంగ విఠల స్వామి ఆలయంలో మంగళవారం భావసారక్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో కామద ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఆనంద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీరామ నవమి తర్వాత వచ్చే ఏకాదశిని ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అందులో భాగంగా ఈసారి ప్రత్యేకంగా ఉదయం 6:30 గంటల నుండే వేడుకలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. 8 గంటలకు రుక్మిణి పాండురంగస్వామి వార్ల స్పర్శ దర్శనం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వనభోజనాల సందడి



కట్టె పట్టు ఆట ఆడుతున్న యువకులు

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి, హంపాపురం గ్రామాల ప్రజలు సోమవారం ఉదయం శ్రీరాముడి చిత్రపటంతో వనభోజనాలకు వెళ్లారు. శ్రీరామనవమి పండుగ తర్వాత మండలంలో వనభోజనాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఆయా గ్రామాల్లో చిన్నా పెద్ద తేడా లేకుండా వంట సామాగ్రి తీసుకుని, ఇళ్లతో పాటు, గుడి, బడికి తాళాలు వేసుకుని సమీపంలోని వ్యవసాయ తోటల వద్దకు వెళ్లారు. అక్కడే పచ్చని చెట్ల కింద వంటలు వండుకుని భోజనం చేశారు. ఉయ్యాలాట, కట్టె పట్టూ, క్యారమ్స్, తొక్కుడు బిళ్ల, బారాకట్ట ఆడుతూ సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు. పలువురు మహిళలు గద్దె చెప్పించుకున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

అనంతపురం: నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న లింగమయ్య బిరియాని సెంటర్‌లో పనిచేస్తున్న షేక్ నూర్ మహమ్మద్ (43) హత్య కేసులో ప్రధాన నిందితుడు శ్రీధర్‌ను అరెస్ట్ చేసినట్లు రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. లింగమయ్య బిరాయని సెంటర్‌లో పనిచేస్తున్న నూర్‌మహమ్మద్, శ్రీధర్, గణేష్ ముగ్గురూ మంచి స్నేహితులు. ఎంతో సరదాగా కలిసి మెలిసి ఉండేవారు. హోటల్‌లో పని విరామ సమయంలో కార్మికులు సేదదీరేందుకు సమీపంలోని రహమత్‌నగర్‌లో ఓ గదిని హోటల్ నిర్వాహకులు అద్దెకు తీసుకున్నారు. హోటల్ పని అయిపోయిన తర్వాత ముగ్గురు స్నేహితులు గదికి చేరుకుని మద్యం సేవించే వారు. ఈ క్రమంలో ఇప్పటికే తన భార్యతో విడాకులు తీసుకున్న శ్రీధర్ రెండో పెళ్లి ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలుసుకున్న నూర్ మహమ్మద్ తరచూ శ్రీధర్ ఆత్మగౌరవం దెబ్బతినేలా కించపరుస్తూ మాట్లాడేవాడు. ఈ మాటలను జీర్ణించుకోలేని శ్రీధర్ కక్ష పెంచుకుని ఆదివారం రహమత్ నగర్‌లోని గదిలో నిద్రిస్తున్న నూర్‌మహమ్మద్ తలపై నల్లబండరాయితో దాడి చేసి, హతమార్చాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పక్కా ఆధారాలతో సోమవారం ఉదయం ప్రకాష్‌రోడ్డులో తచ్చాడుతున్న నిందితుడు శ్రీధర్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు



పోటీలో తలపడిన క్రీడాకారులు

ధర్మవరం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 15వ రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ హాకీ పోటీలు రెండో రోజు సోమవారం హోరాహోరీగా సాగాయి. ప్రకాశం జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు 3–1 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఏలూరు జట్టుపై విశాఖ జట్టు 8–1, గుంటూరు జట్టుపై అన్నమయ్య జిల్లా జట్టు 6–1, ఎన్టీఆర్ జిల్లా జట్టుపై వైఎస్సార్ జిల్లా జట్టు 7–0, ఏలూరు జట్టుపై శ్రీకాకుళం జట్టు 2–0, చిత్తూరు జిల్లా జట్టుపై కాకినాడ జట్టు 6–0, నంద్యాల జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు 5–0 గోల్స్ తేడాతో గెలుపొందాయి. తిరుపతి – అనకాపల్లి, అన్నమయ్య– శ్రీకాకుళం, కాకినాడ – అనంతపురం, వైఎస్సార్ – శ్రీసత్యసాయి జిల్లా జట్ల మధ్య మంగళవారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. పోటీలను హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, ట్రెజరర్ థామస్ పీటర్, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు గౌరిప్రసాద్, కోచ్ హుసేన్ పర్యవేక్షించారు.

ఉత్తమ క్యాడెట్ రోజితకు సన్మానం

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ అవార్డు గ్రహీత, ఉత్తమ క్యాడెట్ కార్పొరల్ రోజితను వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కల్నల్ ఎల్‌డీ రొడ్రిజ్ మాట్లాడుతూ.. రోజితకు అసాధారణ నాయకత్వ లక్షణాలు ఉన్నాయన్నారు. అత్యుత్తమ ప్రదర్శన, సమాజ సేవపై బలమైన నిబద్ధత, సామాజిక బాధ్యతగా ఉండడంతో ఉత్తమ క్యాడెట్ అవార్డు దక్కిందని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, గర్ల్స్ బిల్డింగ్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎల్‌డీ రొడ్రిజ్, ఏఎన్ఓ క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ శారద, పీఐ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి గవర్నర్ అనుమతి



మాట్లాడుతున్న వీసీ సుదర్శన రావు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) 14వ స్నాతకోత్సవ నిర్వహణకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అనుమతి ఇచ్చినట్లు వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు పేర్కొన్నారు. అదే విధంగా స్నాతకోత్సవానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయడానికి 14 కమిటీలను నియామకం చేసినట్లు వెల్లడించారు. అంతకుముందు స్నాతకోత్సవ నిర్వహణకు సంబంధించి వర్సిటీ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.